సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అటవీ వైవిధ్య పరిరక్షణ అవసరం



ఆచార్య హర శ్రీరాములును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: అటవీ వైవిధ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఎస్ ఇండియా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య ఎస్.హర శ్రీరాములు అన్నారు. గురువారం ఏయూ వృక్షశాస్త్ర విభాగంలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రసంగం చేశారు. విద్యార్థులకు అడవుల ప్రాధాన్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి భూమికను వివరించారు. అటవీ విస్తీర్ణాన్ని పెంపొందించే దిశగా యువత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య డి.సంధ్య దీపిక, ఆచార్య బి.సుజాత, ఆచార్య పి.కె.రత్నకుమార్, ఆచార్య ఎస్.బి.పడాల్, డాక్టర్ పి.బలరామ స్వామి యాదవ్, డాక్టర్‌బి.సంధ్యశ్రీ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● స్థానిక పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనంలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థులతో కలిసి డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు ఈ సందర్భంగా పలు మొక్కలు నాటారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన

సీతమ్మధార: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటరావు నేతృత్వంలో రామకృష్ణ ఆధ్వర్యంలో విశాఖ జిల్లాకు సంబంధించి 13 మంది సచివాలయ కార్యదర్శులకు పోస్టల్ బ్యాలెట్‌పై పలు సూచనలిచ్చారు. 85 ఏళ్లు దాటిన వారు, ఫిజికల్ హ్యాండీక్యాప్డ్, కోవిడ్ బాధితులకు సంబంధించి ఇంటి వద్దకు వెళ్లి 12డీ అప్లికేషన్ నింపించి వారి ఓటును పోస్టు ద్వారా పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రెడ్డికంచరపాలెం బాపూజీనగర్‌లో తన అన్న సురేష్‌రెడ్డితో కలిసి నివసిస్తున్న బోర సుధాకర్‌రెడ్డి(40) కూలి పనులు చేస్తుంటాడు. వివాహం కావట్లేదని, తరచూ అందరితో గొడవలు పడుతుండేవాడు. గురువారం ఉదయం పనికి వెళ్లడానికి ఎంతకీ కిందకి రాకపోవడంతో.. అతడి అన్నయ్య మేడ మీద గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందడాన్ని గుర్తించారు. అతడి అక్కకి ఫోన్ చేశారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, సుధాకర్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి అక్క జి.నిర్మల ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వీరమ్ బ్లాక్ ప్రారంభం



వీరమ్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న నేవల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అడ్మిరల్ హరికుమార్

సింధియా: విశాఖపట్నంలోని నౌకాశక్తినగర్‌లో డీఎస్సీ సిబ్బంది (492 మంది పురుషులు) కోసం వసతి భవనం వీరమ్ బ్లాక్‌ను గురువారం నేవల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అడ్మిరల్ ఆర్ హరికుమార్, పీవీఎస్ఎమ్, ఏవీఎస్ఎమ్, వీఎస్ఎమ్ ప్రారంభించారు. వీరమ్ బ్లాక్‌లో బయోగ్యాస్ ప్లాంట్‌తో కూడిన కుక్ హౌస్, వ్యాయామశాల, వినోద పరికరాలు, గ్రంథాలయ సౌకర్యాలతో కూడిన అత్యాధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నేవీ వర్గాలు తెలిపాయి.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

- నియమ, నిబంధనలపై ప్రత్యేక నిఘా
- ప్రశాంత వాతావరణంలో పోలింగ్
- 'సాక్షి'తో తూర్పు నియోజకవర్గం నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మి

సాక్షి ఇంటర్వ్యూ



తూర్పు ఎన్నికల నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మి

ఆరిలోవ: సార్వత్రిక ఎన్నికల వేళ అన్ని రాజకీయ పార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేసుకుంటున్నాయి. విజయం కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. రాజకీయ పార్టీలు ఈ ఎన్నికలను చావోరేవో అన్నట్లు తీసుకుంటున్న వేళ ఎన్నికల నిర్వహణ యంత్రాంగానికి కత్తిమీద సామే. అయితే ఎన్నికలకు తాము సర్వం సిద్ధమయ్యామని.. ప్రణాళికాబద్ధంగా.. పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తూర్పు నియోజకవర్గం నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

మొత్తం ఓటర్లు

తూర్పు నియోజకవర్గంలో 2,83,601 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,38,387 మంది పురుషులు కాగా, మహిళలు 1,45,195 మంది, ఇతరులు 19 మంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గంలో 282 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అన్ని పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. బూత్ లెవెల్ సిబ్బందితో పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలన చేయిస్తున్నాం. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణకు కృషి చేస్తాం.

నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు వీరే

నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి నోడల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. వారితో పాటు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం. ఎక్కడైనా ఎన్నికల నిబంధనలు ఉల్లఘించినట్లు సమాచారం అందిన వెంటనే ఆ బృందాలు తనిఖీలు చేపడతాయి. ప్రతి బృందంలో 8 మంది సిబ్బంది ఉంటారు. వీరిని ఇద్దరు మెజిస్ట్రేరియల్ అధికారులు పర్యవేక్షిస్తారు.

స్టిక్కర్లు, పోస్టర్లు అంటిస్తే చర్యలు

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలపై పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, స్టిక్కర్లు అంటిస్తే చర్యలు తప్పవు. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలపై కూడా అభ్యర్థుల ఫొటోలు ఉండకూడదు. స్టిక్కర్లు ఉన్న వాహనాలను సీజ్ చేస్తాం. పార్టీల కార్యాలయాల ముందు కటౌట్ల ఏర్పాటును నిషేధించాం. పార్టీ కార్యాలయం లోపల ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల గోడలపై స్టిక్కర్లు, వాటి ఆవరణలో కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు ఉంటే 24 గంటల్లో తొలగించాలి. ప్రైవేట్ స్థలాల్లో ఉన్న గోడలపై స్టిక్కర్లు, వాటి ఆవరణలో కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు ఉంటే 72 గంటల్లో తొలగించాలి.

ఐదు బృందాలతో పరిశీలన

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించకుండా మరింత నిఘా పెట్టాం. ఇందు కోసం ఐదు బృందాలను నియమించాం. నిబంధనలు పరిశీలలకు ముగ్గురు సభ్యులతో కూడిన రెండు బృందాలు, ఐదుగురు సభ్యులతో కూడిన స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు మూడింటిని ఏర్పాటు చేశాం. ఆయా బృందాలు ర్యాలీలు, సభలు, సమావేశాలకు వీడియోలు, ఫొటోలు తీసి పరిశీలిస్తుంటాయి. ఎన్నికల ఖర్చు లెక్కకడతాయి.

ముందస్తు అనుమతులు తప్పనిసరి

అభ్యర్థుల తరపున రాజకీయ నాయకులు ఏర్పాటు చేసే సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతులు తీసుకోకుండా సభలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రచారంలో పాల్గొంటే చర్యలు

ఎన్నికల ప్రచారంలో ఏ ప్రభుత్వ ఉద్యోగీ పాల్గొనరాదు. ఎన్నికల ప్రచారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులెవరూ పాల్గొనకూడదు. పబ్లిక్ సెక్టార్ (పీఎస్‌యూ)లలో పని చేసే ఉద్యోగులు కూడా ప్రచారంలో పాల్గొనకూడదు. ఒకవేళ పాల్గొన్నట్టు ఫిర్యాదులొస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకోక తప్పదు.

ప్రత్యేక కాల్ సెంటర్

తూర్పు నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై ఫిర్యాదులు స్వీకరించడానికి జీవీఎంసీ జోన్–3 కార్యాలయంలో ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేశాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 0891–2746314 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఈ నంబర్ 24 గంటలూ అందుబాటులో ఉంటుంది.

హోం బ్యాలెటింగ్‌కు అవకాశం ఉందా?

తూర్పు నియోజకవర్గంలో 3,464 మంది ఓటర్లకు హోం బ్యాలెటింగ్‌కు అవకాశం ఉంది. వారిలో సీనియర్ సిటిజన్లు, డిజేబుల్డ్ వ్యక్తులు, సర్వీసు(ఆర్మీ, ఇండియన్ రైల్వే, ఆల్ ఇండియా రేడియో, తదితర సంస్థల్లో పని చేస్తున్నవారు)లో ఉన్న వ్యక్తులు ఉన్నారు. 85 సంవత్సరాలు దాటిన వారు సీనియర్ సిటిజన్లు 1,787 మంది, డిజేబుల్డ్ వ్యక్తులు 1,447 మంది, సర్వీస్ పర్సన్స్ 230 మంది ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన ఐదు రోజుల్లోగా వారంతా హోం బ్యాలెటింగ్ కోసం '12 డీ'ఫారం ద్వారా నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. నలుగురు అధికారులతో కూడిన బృందాన్ని సదరు వ్యక్తి ఇంటికి పంపి వివరాలను కూలంకషంగా పరిశీలించి బ్యాలెట్‌కు అర్హులో.. కాదో.. నిర్ధారిస్తారు. అర్హులకు పోలింగ్‌కు రెండు, మూడు రోజుల ముందే ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం కల్పిస్తారు. వారు వేసిన ఓటును భద్రపరుస్తారు.

ఫిర్యాదు చేసేవారి పేర్లు గోప్యం

యాప్‌లో ఫిర్యాదు చేయడానికి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. ఎలాంటి ఉల్లంఘనపైనైనా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. లేదా నేరుగా నాకు గాని, మా ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లకు గాని, ఏఈఆర్వోకు గాని ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసేవారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

ఎర్త్ అవర్‌పై ప్రచారం

ఏయూ క్యాంపస్: ఈ నెల 23వ తేదీ రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు ఎర్త్ అవర్‌ని పాటించి విజయవంతం చేయాలని వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్(డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ప్రోగ్రాం అధికారి హని సెలజ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులతో కలిసి ప్రచారం నిర్వహించారు. అటవీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా హని సెలజ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నగరాలలో ఒక గంట సమయం విద్యుత్ ఉపకరణాల వినియోగం నిలిపివేయాలని సూచించారు.

తద్వారా కర్బన ఉద్గారాల సంఖ్య తగ్గించడం సాధ్యపడుతుందన్నారు. ఢిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నంలో పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం మాట్లాడుతూ ధరిత్రీ గంట(ఎర్త్ అవర్)ని జయప్రదం చేయడంలో యువత భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగ ఆచార్యులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సదస్సు ప్రారంభం

ఎంవీపీ కాలనీ: స్థానిక గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో మూడు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. బయో ఇన్ఫర్‌మేటిక్స్ అంశంపై అధ్యాపకుల అభ్యున్నతికి ఆన్‌లైన్ విధానంలో ఈ సదస్సును కళాశాల మైక్రోబయాలజీ విభాగం, కేరళకు చెందిన ఎక్సిల్లోజెన్ బయో ఎక్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఆచార్య రాజగణపతి, ఆచార్య పి.శశిభూషణరావు తదితరులు ఆన్‌లైన్‌లో ఈ కార్యక్రమంలో పాల్గొని జీవావరణ రంగంపై వారి విశ్లేషణలు, అధ్యాయనాలు వెల్లడించారు.

18వ వార్డులో ఎంపీ ఎంవీవీ విస్తృత ప్రచారం

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర గురువారం 18వ వార్డులో కొనసాగింది. ఇందులో భాగంగా ఎంవీవీ 67వ రోజు 18వ వార్డులో ఎంవీపీ కాలనీ సెక్టార్–10లో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఇంటికి మంచి చేసిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించిందన్నారు. భవిష్యత్తులో కూడా సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని ప్రజలు అఖండ మెజారిటీతో మరోసారి గెలిపించాలని ఎంవీవీ పిలుపునిచ్చారు. వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితేనే విశాఖ అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేర్ల దాస్ ఇంట్లో ఎంపీ సహపంక్తి భోజనం

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ గురువారం 19వ వార్డు శివగణేష్‌నగర్‌ను సందర్శించారు. స్థానికంగా ఉన్న సమస్యలపై పలువురు గ్రామస్తులతో ముచ్చటించడంతో పాటు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని స్థానికులను ఆరా తీశారు. ఈ సందర్భంగా పేర్ల దాస్, పేర్ల ఎల్లమ్మ ఇంట్లో గ్రామ పెద్దలు, పార్టీ శ్రేణులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి వెంకటలక్ష్మి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం



సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో పచ్చనేతలు ఎన్ని ప్రలోభాలు పెట్టినా చివరకు వైఎస్సార్‌సీపీదే విజయమని విశాఖ ఎంపీ, ఆ పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ పదో వార్డు ఇందిరా గాంధీనగర్‌లో గురువారం సాయంత్రం కార్యకర్తలతో 'మేము సిద్ధం, మా బూతు సిద్ధం' సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఇక్కడ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఆ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు గతంలో ఇచ్చిన హామీలను 100 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు తన హయాంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు తమకు నచ్చినవారికే పథకాలు ఇచ్చేవారన్నారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి ప్రజలకు మేలు చేశారన్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, బొండా శ్రీనివారావు, పతివాడ కనకరాజు, కెల్ల సత్యనారాయణ, ప్రసాద్, వరలక్ష్మి, నారాయణ, చింతా శ్రీను, బొండా ఉమామహేశ్వరరావు, బూత్‌ల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు 120 బీపీ మెషీన్లు అందజేత



సీపీ రవిశంకర్‌తో జీతో సేవాసంస్థ ప్రతినిధులు

విశాఖ సిటీ: నిత్యం ఒత్తిడితో విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సూచించారు. సీపీ సమావేశ మందిరంలో జీతో సేవా సంస్థ రూ.1.6 లక్షలు విలువ చేసే 120 బీపీ మెషీన్లను పోలీస్ కమిషనర్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలన్నారు. ట్రాఫిక్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఈ బీపీ మెషీన్లను ట్రాఫిక్ అవుట్‌పోస్టులలో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. వీటి సాయంతో డ్రైవర్లు బీపీ తనిఖీ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. జీతో సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ–1 వి.ఎన్.మణికంఠ, డీసీపీ–2 ఎం.సత్తిబాబు, ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు, జీతో సేవాసంస్థ ప్రతినిధులు ఆశిష్ ధరివాల్, నికేష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సమాచారమ్

తాతా సందీప్‌కు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం పరిశోధక విద్యార్థి తాతా శ్రీనివాస రామ సత్య సందీప్‌కు ఏయూ డాక్టరేట్ లభించింది. హ్యూమన్ జెనిటిక్స్ విభాగ ఆచార్యుడు, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పర్యవేక్షణలో 'మాలిక్యులర్, ఫిజియాలజికల్ క్యారక్టరైజేషన్ ఆఫ్ డ్రాట్ స్ట్రెస్ రిలేటెడ్ ట్రాన్స్క్రిప్షన్ ఫ్యాక్టర్స్ అండ్ ఇన్ సిలికో అనాలసిస్ ఫర్ క్రిస్పర్ సాస్ మీడియేటెడ్ జీనోమ్ ఎడిటింగ్ ఇన్ రైస్' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. నీటి కొరత ఉన్న ప్రాంతాలలో పండించే వరి మొక్కలు స్పందించే విధానం, జన్యువుల ప్రభావాన్ని తన పరిశోధనలో అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా సందీప్‌ని విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

డాక్‌యార్డ్‌లో విద్యార్థుల ఇంటర్న్‌షిప్ పూర్తి



నేవల్ డాక్‌యార్డ్ అధికారులతో ఏయూ విద్యార్థులు, ఆచార్యులు

ఏయూ క్యాంపస్: నావల్ డాక్‌యార్డ్‌లో ఏయూకు చెందిన 12 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ని పూర్తి చేశారు. ఫిబ్రవరి 14 నుంచి మార్చి 24వ తేదీ వరకు జరిగిన ఇంటర్న్‌షిప్‌లో పాల్గొని పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్) కమోడోర్ సంజయ్‌కుమార్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసి అభినందించారు. ఇన్స్ట్రుమెంటేషన్ విభాగ విద్యార్థి శ్రీరామ్ ఫణీంద్ర శ్రీసాయి బెస్ట్ ఇంటర్న్‌గా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.మల్లికార్జునరావు, ఆచార్య కె.రాంజీ, ఆచార్య ప్రసాద్, సమన్వయకర్త ఆచార్య గిరి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 వరకు జరిగే ఈ పూజలో పాల్గొనేందుకు రూ.500 చెల్లించిన దంపతులను లేదా ఇద్దరు భక్తులను అనుమతించనున్నట్టు ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



తోటగరువు వద్ద మానవహారం నిర్వహిస్తున్న జోన్–2 కమిషనర్ శైలజావల్లి, సిబ్బంది



గాంధీనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్సీ, సిబ్బంది

ఆరిలోవ: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ జోన్–2 కమిషనర్ జి.శైలజావల్లి తెలిపారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల వద్ద గురువారం ప్రారంభమైన ర్యాలీ తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు సాగింది. అక్కడ మానవహారం నిర్వహించి, ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ 'మీ ఓటు–మీ భవిష్యత్' పేరుతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ఓటు ఆయుధంలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో రూట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 100 మంది మత్స్యకారులు



పార్టీలో చేరిన మత్స్యకారులతో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18, 19వ వార్డులకు చెందిన 100 మందికి పైగా మత్స్యకారులు వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం సాయంత్రం లాసన్స్ బే కాలనీలోని ఎంపీ ఎంవీవీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మత్స్యకారులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గంపల వెంకట రామచంద్రరావు ఆధ్వర్యంలో వీరంతా వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా రంజక పాలనకు ఆకర్షితులు కావడంతో పాటు తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సమర్థ నాయకత్వంపై ప్రభావితులమై పార్టీలో చేరామన్నారు. కుల, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేద ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి పెద్ద ఎత్తున కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దాసు, గణేష్‌లతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నీ ప్రారంభం



వాలీబాల్ మెన్ పోటీల్లో స్పైక్‌ను బ్లాక్ చేస్తున్న ఆటగాళ్లు

విశాఖ స్పోర్ట్స్: డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్ గురువారం రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభమైంది. మెన్‌లో ఎనిమిది జట్లు, వుమెన్‌లో నాలుగు జట్లు నాకవుట్ కమ్ లీగ్ పద్ధతిలో తలపడుతున్నాయి. ఈ పోటీలను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన జట్లను అభినందించారు. రైల్వే స్టేడియంలో పూర్తిస్థాయి క్రీడా వసతులున్నాయన్నారు. ఈ నెల 24తో ముగియనున్న టోర్నీ పోటీలను ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధీర్‌కుమార్, ఈకోర్సా వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్ బాతి, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఆర్‌ఎస్ అడహక్ రీజనల్ అడ్వైజరీ కమిటీలో 'పల్లి'



పల్లి నాగభూషణరావు

దాబాగార్డెన్స్: భారత ప్రభుత్వంచే కాపీరైట్ సొసైటీగా నమోదైన ఇండియన్ పెర్ఫార్మింగ్ రైట్ సొసైటీ(ముంబై) ఇటీవల దక్షిణ భారతదేశంలో తెలుగు భాషకు సంబంధించి ఐపీఆర్‌ఎస్ అడహక్ రీజనల్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసింది. ఏడుగురు ప్రముఖులు గల ఈ కమిటీలో వ్యావహారిక గీత రచయిత, స్వరకర్త, గాయకుడు పల్లి నాగభూషణరావుకు సభ్యుడిగా స్థానం కల్పించారు. కమిటీ సభ్యుల్లో హైదరాబాద్‌కు చెందిన రబీంద్ర ప్రసాద్ పట్నాయక్, అర్రం వేణుగోపాల్, కృష్ణకాంత్ గుండగాని, భాస్కరభట్ల రవికుమార్, ఎంఎం శ్రీలేఖ, కీర్తితో పాటు విశాఖకు చెందిన పల్లి నాగభూషణరావు ఎంపికయ్యారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం డిమిరయా గ్రామంలో జన్మించిన పల్లి తన సహోధ్యాయుడైన బిన్నాల నరసింహమూర్తితో కలిసి శ్రీమాతా స్టూడియోను విశాఖలో స్థాపించి, ఎంతో మంది సామాన్య కళాకారులను సెలబ్రిటీలుగా చేశారు. అన్ని కళా రూపాలను యూ ట్యూబ్ చానళ్లలో నిక్షిప్తం చేసి, విశ్వాత్మక కళా సంగ్రహ వేదికను తయారు చేశారు పల్లి నాగభూషణరావు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
9912220751
Office mail : sakshiadvtvsp@gmail.com